

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(1), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# దేశభక్తి ప్రబోధాత్మకం –స్వయంవరం

- డా. జి. వెంకట లక్ష్మి,

"లలిత కళల యందు బలమైన యభిరుచి
చిన్నతనము నందు చిగురుబెట్టి
లీల నెదిగి చిత్రలేఖనంబయి మారి
కట్ట కడకు నాంధ్ర కవనమయ్యె" - అని జాషూవా గారు తనకు కవిత్వ అభిరుచి చిన్నతనం నుండే ఏర్పడిందని చెప్పుకున్నారు .నవయుగ కవి చక్రవర్తి ,మధుర శ్రీనాథ ,విశ్వకవి సామ్రాట్టుగా పేరొందిన ఈ కవి సామజిక ప్రయోజనం కోసం ,మూఢాచారాలపై తిరుగుబాటు చేస్తూ ,1950 ప్రాంతంలో "స్వయంవరం "అనే కవితాఖండికను ప్రచురించారు .దీనిలో బాల్యము ,స్వయంవరం ,దేశాటన ,హిమగిరియాత్ర అనే నాలుగు భాగాలున్నాయి .గాంధీజీ మనుమరాలిగా పేర్కొన్న "స్వరాజ్య "బాల నాయిక. కవి దీని రచనా ఉద్దేశ్యం పేర్కొంటూ "ప్రకృతిలో .విజ్ఞానంలో .విద్యలో ,కళాలోకంలో ,సంఘంలో రావల్సిన మార్పులను "వర్ణించానన్నారు.

"బాల్యములో స్వరాజ్య బాల పుట్టుక వర్ణన ఉంది .గాంధీజీ సత్యం ,అహింస సాధనాలుగా ,మంచి నడవడిక ,మాటతప్పని గుణం ,కులమత పట్టింపులు లేకుండా సాగించిన స్వాతంత్రోద్యమంలో ఎందరో త్యాగులు,వీరులు ఆకలి దప్పులు లేకుండా ,స్వార్ధచింతన వీడి తమ పవిత్రనెత్తుటి ధారలతోఈ భూమిని పావనం చేస్తూ ,భరతమాతకు స్వేచ్ఛను ప్రసాదించారు . అలా స్వరాజ్య బాల పుట్టింది .దేశవిదేశీయుల పొగడ్తల మధ్య ఉరుసులు ,తిరునాళ్ళు జరుపుతూ ప్రజలంతా మురిసిపోయారు ."నిసుగున కేడుమాసములు నిండియు నిండకముందె పాపమా /ముసలిని పొట్ట బెట్టుకొని పోయె నొకానొక పుణ్యమూర్తి ....చరిత్రలో గరఁగి పోసే సిఖండ కళంకపంకమున్ "-కరకు గొన్న మతం మత్తు గాంధీజీ ని బలిగొన్నది.చరిత్రలో ఒక కళంకం నిలిచిపోయింది .ప్రజలంతా భజనలు చేస్తూ ,స్వరాజ్య బాలకు గాంధీ విగ్రహాలను చూపిస్తూ ఊరట చెందారు .

స్వరాజ్య బాల గాంధీజీ గుణగణాలు పుణికిపుచ్చుకుని త్యాగం ,సత్యసూక్తి ,విచక్షణ ,సద్వర్తనం ,కష్టించేతత్వం ,ధర్మసూక్తులు అలవర్చుకుంటూ పెరిగి పెద్దైయింది .ఆ కన్యకు యావద్భారతదేశంలో జాతి పట్టింపులు లేకుండా ,అర్హతగల వరుడుకావాలని స్వయంవరం ప్రకటించబడింది .

మంచి చెడ్డను ,చెడ్డను మంచి జేసి
నిముష వేగా శ్వముల నెక్కి నేర్పు మీర
సృష్టిపై పెత్తనము జలాయించుచున్న

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(1), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

కాలము కన్న తుంటరి గానరాడు"-అంటూ కవి నిమేష మాత్రంలో మంచిని చెడుగా,చెడుని మంచిగా మార్చి సృష్టిపై ఆధిపత్యాన్ని చూపే కాలం వల్ల మనుషుల మనస్తత్వాలు మారాయని కవి చెప్తూ ,ఆ మార్పు స్వయంవరానికి విచ్చేసిన పెండ్లి కొడుకుల రూపంలో చూపాడు . శాసన సభల్లో సభ్యత్వం కోసం వింత సంస్థలు స్థాపించినవారు,ఊసరవెల్లి లాంటి స్వార్థపరులు ,ఉద్యోగం పోగొట్టుకున్న రోషపరులు ,నిమ్న జాతులమీద నిప్పులు చెరిగే వారు ,బాల్య వివాహాలు చేసి విధవలైన పసికూనల కన్నీటి వరదల్లో హాయిగా కొడుకుల పెండ్లి చేసి ,సిగ్గు ,బిడియం వదిలిన ముసలివాళ్ళు ,జంటవడ్డీలతో పేదల రక్తమాంసాలు తినే వడ్డీరాయుళ్ళు ,దేవతా మూర్తులతో వ్యాపారం చేసే వారు ,పదవిలో ఉంటూ అర్హులైన వారిని పక్కనపెట్టి ,తన పలుకుబడితో తన వాళ్లకి ఉద్యోగాలిప్పించేవారు ,బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ ,సంసారాలు కూలుస్తూబయటికి మాత్రం దేశభక్తుల్లా చెలామణి అయ్యేవారు ,మతం ,దేవుళ్ళ ముసుగులో ఐకమత్యాన్ని పాడుచేసి ,సంకుచిత భావాలు వెదచల్లుతూ తప్పులు చేసేవారు ,స్వార్థ పూరిత తత్వజ్ఞాన పీఠాధిపతులు ,లోపలొకటి ,బైటకొకటి ప్రదర్శించే నటులు ,కులాల మధ్య చిచ్చు పెట్టి స్వలాభం చూసుకునే వారు ,గాంధిజీ పేరు చెప్పుకుంటూ దేశానికి చిచ్చు పెట్టే విషస్వభావులు ,శిలాచిత్తులు ,ప్రజాభక్షకులై స్వప్రయోజనం ఆశించేరాజకీయనాయకులు,

పూర్వగర్వం ప్రదర్శించే సంకుచిత స్వభావులు ,హిందూమత మద్యపాయి వర్ణసంకరపు దివాలాఖోరు ,సాటి మనుషులను గుర్తించలేని కఠోరచిత్తులు ,ప్రజల రక్తాన్ని తాగే తాలూకా అధికారి ,స్త్రీ విద్యా వ్యతిరేకవాదులు,కాశీ దాక చర్చలు సాగించిన మిథ్యవేదాంతి "-ఇలా రకరకాల మనస్తత్వాలవారిని కవి పెండ్లికుమారులుగా చిత్రీకరించి మారిన సమాజ స్థితిగతులకు అద్దం పట్టాడు.వీరందరిని చూసి స్వరాజ్య కన్య దుఃఖం తో మండపాన్ని వదిలి వెళ్ళిపోయింది .వచ్చిన వారు నిందను ఆమెపై వేస్తూ ,పక్షపాత స్వయంవరం ఇది అనుకుంటూ వెళ్లిపోయారు . ఆత్మవిమర్శ చేసుకునే స్థితిలో కూడ ఈ మనుషులు లేరని కవి ఈ సందర్భంలో వ్యక్తం చేసాడు .

" దేశాటన "-లో స్వరాజ్య కన్య తగిన వరునికై వెతుకుతూ ,దేశంలోని వివిధ ప్రాంతాలను దర్శించింది ."జంబూ ద్వీపంబునకున్/జంబూన ద భూషలైన జనపదములు,గ్రా /మంబులు పక్కణములు పా /దంబులు కందంగ దిరిగె దయితుని కొఱకై"-లుంబిని ,ఆరావళి పర్వతాలు ,ప్రతాపగడ్,జలియన్ వాలాబాగ్ ,కలకత్తా ,బెంగాల్ ,మరాఠా ప్రాంతం ,లాహెూర్ ,అలహాబాద్ ,బ్రహ్మకు కూడ సలాం చేయని నిజాం రాజ్యం ,గోల్కొండ వంటి ప్రాంతాలను వర్ణిస్తూ ,రాణాప్రతాప్ ,రాజారామ్ మోహన్ రాయ్ ,సుభాష్ చంద్రబోస్ ,చిత్తరంజనుదాస్,బాలగంగాధర్ తిలక్ ,లాల లజపతిరాయ్ ,రవీంద్రనాథ్ టాగోర్ ,నెహ్రూ వంటి ప్రముఖుల ప్రస్తావన ,చారిత్రిక ఘనతను కవి ప్రస్తావించాడు ."ఇదిగో వచ్చెస్వరాజ్యం ...కరుణా /హృదయా !కొనుమమ్మ యీ దరిద్రదస్తవముల్ /తొలగిపోయినారు దొరలింకమన వారి /దొరతనాన సే గి కేమి కతము?"-అంటూ కవి స్వాతంత్ర్యానంతరం మారిన సమాజ పరిస్థితి ,మానవ మనస్తత్వాన్ని ఎత్తిచూపాడు .స్వరాజ్యం వల్ల ఎదో జరుగుతుందని సామాన్యులు భావించారు .కాని నాడు ప్రతీ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(1), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

పదార్థంలో ప్రతి ఫలించిన ఉదాత్తత ,సామరస్యం ,చైతన్యం నేడు సన్నగిల్లిందని కవి భావించాడు .ఐశ్వర్యం మానవత్వాన్ని రూపుమాపింది .అవసరాలకు తగ్గ శత్రుత్వం ,మిత్రుత్వం ,నిరక్షరాస్యత ,సోమరితనం ,ఆలోచన లేమి ,పక్షపాతం తో పతనమైన ప్రతిభ ,కులమతాల రగడ ,సంకుచిత బుద్ధితో స్త్రీలకు సాంఘిక దురాచారాల కట్టుబాట్లు ,మంచి బుద్ధిని పెంచలేని చదువులు ,పేదవాడి ప్రతిభకు గుర్తింపు లేకపోవడం ,హరిజనులను ముట్టరాని ,తగ్గని పుండులా చూడడం ,పట్టభద్రులు సామాన్యులకు దూరమవడం ...వంటి చర్యలన్నీ శాంతి విఘాతకాలని కవి అనుకున్నాడు .

"పసిపాపలకె స్వర్గపదవిగా కన్యుల

కంద బోదని యేసుడన్నమాట

అధికుండ నన్నవా డ ధముం డంచు

మతము లు ద్ఘోషించు మంచి మాట

సహనంబు సర్వ విశ్వము నేలగలదంచు

గుజరాతు ముని మొత్తుకున్న సూక్తి

ఆశయే దుఃఖాల కాది కారణమంచు

శాక్య సింహుడు పల్కి చన్నహితవు

స్వార్థ పరమైన కపట రూపములు దాల్చి

సకల దిక్కుల నాట్యంబు సలుపుచుండ

కంట తడి పెట్టె గాంధివిగ్రహముల నరసి ...-అంటూ కవి పసిపాపలాగ కల్మషం లేకుండా ఉన్నవారికే స్వర్గ పదవి అన్న ఏసుక్రీస్తుని ,నేనే అధికుడను అనుకునే వాడే అధముడన్న మతాలను ,సహనం సర్వజగత్తును ఏలుతుందన్న గాంధీని ,కోరికలే సర్వ దుఃఖాలకు హేతువన్న బుద్ధున్ని తలుస్తూ వారు ప్రబోధించిన బాటలో మానవాళి పయనించాలని కాంక్షించాడు .

"హిమగిరి యాత్ర "లో హిమాలయ వనసీమలను కవి వర్ణిస్తూ ఆ ప్రాంతమంతా సాక్షాత్తూ లక్ష్మీదేవిని చంకనెత్తుకొనితిరుగు తున్నట్లుగా చెప్పాడు .ఆ వనంలోని జంతు సముదాయం జాతి వైరాన్ని మరచి స్నేహభావంతో ఉన్నాయి .చల్లని మేఘాలు మధుర స్పర్శను కలిగిస్తున్నాయి .కోరికల తాకిడి లేకుండా ,ధర్మం తప్పని స్వభావంతో ,అధికార దర్పం లేని ,వర్ణ భేదం చూపని జీవజాలాలు అక్కడ సేదతీరుతున్నాయని కవి వర్ణించాడు .ఆ ప్రాంతాల్లో నివసించే కొండదొరలు ,బోయలు ప్రకృతి ప్రసాదించిన పుష్కలమైన పంటలతో ,పండ్లతో అపకారచింతన లేకుండ,నాగరికత ముసుగుతోమోసం చేసే పని లేకుండ ,ఆకలితో అలమటించే ప్రాణి లేకుండ హాయిగా ఉన్నారు .ఈ ప్రకృతిని కవి త్యాగుల ధర్మ సందేశాలను ఆచరిస్తున్న శాంతి పాఠశాలగా పేర్కొన్నాడు .

Cover Page


INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(1), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

చివరికి రాజాఘట్టము దగ్గర గాంధీజీ పోలికలతో ,ఇంద్రియనిగ్రహం ,మంచి నడవడికత తో సాంఘిక దురాచారాలను ఎదిరించి ,పదిమందికి ఆదర్శప్రాయుడైనవాడు ,గాంధీ కత్తివాదరమీద తపస్సు చేసే శక్తి గలవాడిని ,తన ఈడుజోడైన వాడిని దేశవిదేశీయులు కానుకలు ,ఆశీస్సులు అందిస్తుండగా స్వరాజ్య కన్య వివాహమాడిందని కవి చెప్పి ,అటువంటి లక్షణాలను అందరు అలవర్చుకోవాలని కోరుకున్నాడు ."మధుర వర్తనులగు మేటి మంత్రిమణులు/గృహము దీర్చ ప్రజారాజ్య వాహనయగుచు /బసుపు గుంకాల సిరి తోడ భారత పీఠి/పాలనము చేసె వెయ్యేండ్లు ప్రతిభ మీర!"-స్వరాజ్య కన్య దేశంలోని అశాంత వాతావరణాన్ని చక్కదిద్ది ,మంచి శీలం కలిగిన ధర్మ పథంలోకి నడిపింది .చేసే పని పట్ల నిబద్ధత ,కష్టాన్ని నమ్ముకుంటూ ,పరోపకారభావంతో నవ్య భావాలను స్వాగతిస్తూ దేశభక్తితో ఉండేవాళ్ళు ,నిస్వార్థ పరులతో ,మూర్ఖపు అధమ సంస్కృతి నశించి ,అక్షరాస్యత పెరిగి, కళలు ప్రోత్సహింపబడుతూ ,భూమికి తగ్గ పంటలతో ఆకలికి అలమటించే అన్నార్తులు లేకుండా ప్రజారాజ్యం అవతరించిందని చెప్పడం వెనుక కవి యొక్క మనోకాంక్ష మనకు గోచరిస్తుంది .

స్వయంవరం లోని నాయక" స్వరాజ్యం" కి, గబ్బిలం లోని" గబ్బిలానికి" పోలికలు ఉన్నాయి.కులవివక్షత నిర్మూలన కోసం గబ్బిలం వివిధ ప్రాంతాలు దర్శిస్తూ, కైలాసానికి చేరుతుంది.స్వరాజ్య కన్య ధర్మ బద్ధ, నీతి వర్తనం, శాంతియుత దేశం కోసం వివిధ ప్రాంతాలు దర్శిస్తూ, హిమాలయాలకు చేరుకుంది. వివిధ సందర్భాల్లో జాషువా గారి భావుకత, ప్రకృతి ప్రియత్వం,ఆత్మీయత ముద్ర, సామాజిక, రాజకీయ పరిస్థితులు, ఆవేదన అభ్యుదయ కాంక్ష వ్యక్తమౌతుంది.

తమ్మి చూలి కేలు దమ్మి ని గల నేర్పు/ కవి కలంబు నందు గలదు గాన/ ఈశ్వరత్వ మతనికే చెలామణియయ్యె/ నిక్కువముగ పూజనీయుడతడు- అని జాషువా గారే చెప్పుకున్నట్లు విశ్వశాంతి ని కాంక్షిస్తూ తన రచనల ద్వారా అజరామరుడైన ఈ కవి నిజంగా పూజనీయుడే. స్వార్థ కుల రాజకీయాల మధ్య నలిగినా, జీవితాన ఎన్ని ఆటంకాలు ఎదురైనా, తలవంచక సమాజ శ్రేయస్సుకై కవితా లతాంగి ని కౌగిట చేర్చుకున్న కవి జాషువా. గాంధీజీ జ్ఞాపకాలను నెమరేసుకుంటూ శాంతి,అహింసల గొప్పతనాన్ని చాటి చెప్తూ ముందు కేగిన సాహిత్య బాటసారి.

సాహిత్యం సమాజ దర్పణం అందులో కవి స్రష్ట,ద్రష్ట. స్వయంవరం కావ్య ఖండిక 1950 ప్రాంతంలో ప్రాణంపోసుకున్నా దీనిలోని అంశాలు మాత్రం నేటికీ సమాజాన్ని ప్రభావితం చేసేవే ఉన్నాయి. "ఇటలీ భాష విధాన కమ్మనయి,మున్నే బ్రౌన్ చిత్తంబు గుప్పిట సంధించిన తెల్గుచక్కదనమున్ ....."అంటూ దేశవిదేశీయులు ఆదరించిన తెలుగు భాషకి ప్రాభవం తగ్గి ,కవులు దారిద్రావస్థలో ఉన్నారని కవి ఆవేదన వ్యక్తం చేసాడు."పేదవాని కళకు పెద్దరికం బిచ్చి /గౌరవింపదెపుడుకటిక జగము "-అనే భావన కవి వ్యక్తం చేసాడు. "శాపము చేత శిల్పులు ప్రశస్త చమత్కృతి జేసి...ముత్సవ వేళల వాహనాలపై "-అనే పద్యంలో శిల్పుల నైపుణ్యం చేత దేవతామూర్తులుగా ఒదిగి ,శరీరాన్ని కూడా కదల్చలేక మనుషులచే ఊరేగింపబడుతూ ,వారి కష్టాలను తీర్చలేని వాడు దేవుడని కవి తీవ్రంగా దుయ్యబట్టినా అందులో కవి యొక్క భావావేశం ,మానసిక ఆవేదన


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:8(1), August 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

వ్యక్తం అవుతుంది. "పురుషుల లోభంపు... కామిని పురుష చక్ర యుగంబు భరింపకుండినన్"- అనే పద్యంలో రథ చక్రాల్లాగా స్త్రీపురుషులు ఆధిపత్యధోరణి లేకుండా చక్కటి జీవనగమనం సాగించాలనే కవికాంక్ష కనిపిస్తుంది. స్వరాజ్యకన్యకు హరిజనకన్యలు హారతులివ్వడం, స్వాగతం పలకడం, చెలికత్తెలుగా రావడం - ఇవన్నీ హరిజనాభ్యుదయ కోరికను వెల్లడిస్తుంది. ఒకపక్క పెద్దలు కులాల రొంపితో పోట్లాడుకుంటుంటే, మరోపక్క పసిపాపలు వర్ణభేదం లేకుండా ఆడుతున్నారని తెలుపుతూ, స్వచ్ఛమైన పసిపాపల  హృదయవైశాల్యం పెద్దలు నేర్వాలనే ప్రబోధం కనిపిస్తుంది. నిమ్న వర్గాలు కూడా తెగల ఘర్షణలో పడి శాంతి కోల్పోకుండా, ఐకమత్యం తో మెలిగి, మర్యాదతో మనుగడ సాగించాలనే కవి హితవు గోచరిస్తుంది. త్యాగధనుల వీరచరిత్ర లు చదివి వారిలోని మంచిగుణాలు కొన్నైనా అలవర్చుకోవాలని కవి హితవు చెప్పాడు. గుడితో పాటు లింగాన్ని కూడా స్వాహా చేసే స్వార్థపరులు శాసనసభల్లో అడుగుపెడుతున్నారని కవి స్పష్టం చేస్తూ, స్వార్థచింతన లేని రాజకీయాలు ప్రజాస్వామ్యానికి పునాదిలాంటిదని వ్యక్తం చేశాడు. అన్నార్తులు, అనాథలు,లేని సువిశాల, సుందర భారతదేశాన్ని, ఇతర దేశాలు కూడా ఆదర్శంగా తీసుకునే మాతృభూమిని కవి కోరుకున్నాడు. ఈ విధంగా విశ్వశ్రేయస్సు కాంక్షించిన కవి గుర్రం జాషువా నిజంగా ధన్యజీవి.

**- డా. జి. వెంకట లక్ష్మి,**

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్, రంగారెడ్డి జిల్లా.

99490 59179

## ఉపయుక్త గ్రంథాలు

1. జాషువా రచనలు - సంపుటి.3, ప్రచురణ: నవ చేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, జనవరి -2018

2. తెలుగులో కవిత్వోద్యమాలు: తెలుగు అకాడెమీ ప్రచురణ

3. తెలుగు సాహిత్య చరిత్ర - డా. ద్వానా శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచు రణ.

4. గబ్బిలం - గుర్రం జాషువా, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ.

5. తెలుగులో గేయ కవిత్వం - సామాజిక చైతన్యం - డా. గుర్రం విజయ్ కుమార్, 2005 ప్రచురణ.